క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ -2024 ఆన్‌లైన్ పరీక్షలు మూడో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లాలో ఏడు కేంద్రాల్లో శనివారం పరీక్షలు జరిగాయి. మూడో రోజు 2,249 మంది అభ్యర్థులను కేటాయించగా 1,911 మంది హాజరయ్యారు. 338 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. శ్రీవాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, (తిరువూరు), ఐయాన్ డిజిటల్ జోన్ (కండ్రిక, విజయవాడ), ఎస్వీ ఇన్ఫోటెక్ (రామమందిరం రోడ్డు విజయవాడ), లైఫ్‌బ్రిడ్జి ఇన్ఫో టెక్నాలజీస్ (గొల్లపూడి విజయవాడ), శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు విజయవాడ రూరల్), దారిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఖమ్మం), విజయ ఇంజనీరింగ్ కాలేజ్ (ఖమ్మం) తదితర పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగాయి. మొదటి షిఫ్ట్‌లో 1,279 మంది అభ్యర్థులను పరీక్షకు కేటాయించగా అందులో 1,109 మంది హాజరయ్యారు. 168 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 977 మందికి 802 మంది హాజరయ్యారు. 170 మంది గైర్హాజరయ్యారు.

వరద బాధితులకు ఎస్‌జేసీ ఫౌండేషన్ చేయూత



వించిపేట(విజయవాడపశ్చిమ): కర్నాటక రాష్ట్రం, హుబ్లీకి చెందిన ఎస్‌జేసీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వరద ముంపు బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ మేరకు నగరంలోని భవానీపురం, రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ, సింగ్‌నగర్ తదితర ప్రాంతాలలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో హుబ్లీ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కలకుంట స్వర్ణ పాల్గొని బాధితులకు నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హుబ్లీలోని ఏఈఎల్‌సీ చర్చి, సెయింట్ జోన్స్ స్కూల్స్ యాజమాన్యం, దాతల సాయంతో విజయవాడ నగరంలో వరద ముంపునకు గురైన బాధితులకు సాయం అందిస్తున్నామన్నారు. వెయ్యి మంది బాధితులను గుర్తించి వారికి బియ్యం, దుస్తులు, నిత్యావసరాలు అందజేశామని తెలిపారు.

భక్తులకు అన్నదానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గవర్నర్‌పేట విజయభాస్కర్ టిఫిన్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిఫిన్ సెంటర్ యజమానులు భాస్కరరావు, విజయ కుమారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ దుర్గాపురం ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ వీధి, బీఆర్‌టీఎస్ రోడ్డు, దుర్గాపురం, విఘ్నేశ్వర టెంపుల్ రోడ్డు, ఇదుపుగంటి లక్ష్మణరావు స్ట్రీట్, రజక వీధి, గణపతి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వరద ముంపు ప్రాంత యువతకు శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లోని యువతకు శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏసీ రిపేర్, కుట్టు మిషన్ శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థల ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు టీవీఎస్టీ సాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో రాజీవ్‌నగర్‌లోని భారత్ వికాస్ పరిషత్ భవనంలో శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 19–30 మధ్య వయస్సు ఉన్న వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. 37 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, అనంతరం ప్రఖ్యాత ఏసీ కంపెనీలలో ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. అలాగే 50 మంది మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ శ్రీ శారద విద్యాలయం, శాంతినగర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు గణేష్- 99512 84459, గంగాధర్ -78934 16244, లక్ష్మి - 99485 57070, లలిత- 81252 66864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.



అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులు



హారతులు అందుకుంటున్న భక్తులు



కుమారి పూజ చేస్తున్న ఆలయ అర్చకులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అన్నపూర్ణాదేవీ.. రక్షించుమాతా

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునే ఆలయం వద్దకు చేరుకున్నారు. అన్నపూర్ణాదేవీ.. రక్షించుమాతా అంటూ మహిళలు అమ్మను వేడుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పారిశుద్ధ్యం, నగరాభివృద్ధిపై దృష్టి పెట్టండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో దసరా ఉత్సవాలు జరుగుతున్నప్పటికీ వీఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ, నగరాభివృద్ధి పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం ఆయన దసరా ఉత్సవాల ఏర్పాటు నగర పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధిపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సమస్యలపై చర్చించారు. శాఖాధిపతులు అందరూ వరదలు తర్వాత వారి వారి శాఖల్లో ఉన్న మరమ్మతులు, వాటికి తీసుకున్న చర్యలు, చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. సమస్యలన్నీ సమన్వయంతో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయాలని, ఉన్న పార్కుల్లో ఎటువంటి సమస్యలున్నాయో, వాటి మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థకు నూతనంగా విధులు స్వీకరించిన చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు స్వయంగా ఫీల్డ్‌లో వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి సమస్యలు, వాటి పరిష్కారాలతో నివేదికతో రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్లు (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు అందించిన సాయంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితుల్లో ఎవరిని పలకరించినా హృదయాన్ని కదిలించే కన్నీటి గాథలే వినిపిస్తున్నాయని చెప్పారు. వరద సాయంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇటీవల రూ.1,036 కోట్లు ప్రకటించడంతో పాటు దాతలు పెద్దఎత్తున విరాళాలు అందించారని తెలిపారు. అయినా బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటం బాధాకరమన్నారు. 179 వార్డు సచివాలయాల పరిధిలో 14 వేల మంది మాత్రమే మిగిలినట్లు అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి 50 వేల కుటుంబాలకి పైగా సాయం అందలేదన్నారు. కలెక్టరేట్ వద్ద నిత్యం పోటెత్తుతున్న బాధితుల రద్దీనే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే నగరంలోని మొత్తం బాధితులు.. ప్రభుత్వం వారికి అందించిన సాయాన్ని గణాంకాలతో ప్రకటించాలన్నారు. ఒక్కో సచివాలయ పరిధిలో గ్రౌండ్ ఫ్లోర్ లో ఎంతమంది నివసిస్తున్నారు..? ఫస్ట్ ఫ్లోర్ లో ఎంత మంది నివసిస్తున్నారు..? టూవీలర్ లు ఎన్ని..? ఫోర్ వీలర్ లు ఎన్ని..? ఆటో కార్మికులకు అందించిన సాయం వివరాలను వెల్లడించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి డీటీలు, రెవెన్యూ సిబ్బందిని తీసుకొచ్చి సర్వే నిర్వహించడంతో ఎన్యుమరేషన్ మొత్తం లోపాలతో నిండిందని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న వలంటీర్లను వినియోగించుకుని ఉంటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. నెల రోజులు గడుస్తున్నా.. నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైన ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఏవిధంగా అవుతుందో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం తక్షణమే వరద బాధితులకు అందించిన సాయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయి పరిహారం అందించకపోతే.. బాధితుల తరపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పడుతుందని ఆయన హెచ్చరించారు.

కరుణించమ్మా.. అన్నపూర్ణాదేవీ..



శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో అమ్మవారు



జీవీఆర్‌నగర్‌లో అమ్మవారు

విజయవాడ కల్చరల్: అన్నపూర్ణాదేవి రక్షించమ్మా.. కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవారి అలంకారం చూసి పరవశించారు. నగరంలో దేవి నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. లబ్బీపేట కంచి కామకోటిపీఠ శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు అనంతరం శారదా మాతను అభయ ప్రదాత అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దేవాలయ ట్రస్టీ బోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్, మేనేజర్ శర్మ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. దుర్గాపురంలోని శృంగేరీ శారదాపీఠ శివరామ కృష్ణ క్షేత్రంలో శారదా దేవిని అన్నపూర్ణగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ భారతీ తీర్థ మహాస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శనివారం శివకామేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ నేతాజీకాలనీలో అంకమ్మతల్లి శక్తిపీఠం, జీవీఆర్‌నగర్ దేవున మండపం, దావు బుచ్చయ్యకాలనీ శ్యామలాంబదేవి దేశాలయం, రామలింగేశ్వర్‌పేట ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశానికి సేవ



విజేతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోతైన ఆలోచన కలిగిన విప్లవకారుడు భగత్‌సింగ్ అని నేటి యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని నవజవాన్ భారత్ సభ సభ్యుడు డాక్టర్ యస్. సురేష్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం దిశ విద్యార్థి సంఘం (దిశ) నవజవాన్ భారత్ సభ ఆధ్వర్యాన షహీద్-ఎ-ఆజం భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించటానికి తాము పాఠశాలలు, కళాశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. 'భగత్ సింగ్ అనుసరించిన మార్గం నేడు మనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుంది' అని అన్నారు. దిశ విద్యార్థి సంఘం సభ్యులు అమూల్య మాట్లాడుతూ భగత్ సింగ్ ను ఒక రాజకీయ కార్యకర్తగా అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. విద్యార్థులు రాజకీయాల గురించి ఆలోచించకుండా బాగా చదువుకోవాలని, తమ జీవితాన్ని సరిదిద్దుకోవాలని మనం తరచుగా వింటాం అన్నారు.. అయితే, మనం పట్టించుకోకపోయినా రాజకీయాలు మన జీవితంపై ప్రభావం చూపుతూనే ఉంటాయన్నారు. అందుకే విద్యార్థులు, యువత తమ చుట్టూ ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవడం, రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి ఉండడం చాలా ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు నృత్యనీరాజనం



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న యల్లా జోస్యుల అనూరాధ బృందం

విజయవాడ కల్చరల్: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు మూడవ రోజుకు చేరుకున్నాయి. కె.రత్నకుమారి బృందం దివ్యనామ సంకీర్తనతో శనివారం నాటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుచిత, ఆకురాతి కోదండ రామయ్య, ఎం.నాగలక్ష్మి భక్తి కీర్తనలు ఆలపించారు. సంప్రదాయ నృత్యంలో భాగంగా ఎ.గాయత్రి. యల్లా జోస్యుల అనూరాధ, రాయన శ్రీనివాసరావు, సాహితీ అయ్యంగార్, శైలజ, వాసుదేవరావు, లక్ష్మీ సౌజన్య తమ బృందాలతో అష్టలక్ష్మీవైభవం, అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి తదితర వాగ్గేయకారులు రచించిన కీర్తనలకు నృత్యాలు అభినయించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు సైదా, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

భక్తిగా సాగిన నామ సంకీర్తనం



నామ సంకీర్తనలు గానం చేస్తున్న శ్రీరామ భాగవతార్

శరన్నవరాత్రులు కార్యక్రమంలో భాగంగా శ్రీ శృంగేరీ పీఠపాలిత శివ రామకృష్ణ క్షేత్రంలో శనివారం నిర్వహించిన భజరే శారదాం నామ సంకీర్తన భక్తిగా సాగింది. చెన్నైకి చెందిన సంగీత విద్వాంసుడు శ్రీ రామభాగవతార్ బృందంతో ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి, స్వాతి తిరునాళ్ రచించి స్వరపరచిన సంకీర్తనలు మధురంగా గానం చేశారు. రెండు గంటల పాటు సాగిన కార్యక్రమంలో పలు సంకీర్తనలు చోటు చేసుకున్నాయి. సంగీత విద్వాంసులు పలువురు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు...



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

శరన్నవరాత్రులు కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం సీతా రామా కల్యాణమండంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయ బృందం మాగలూరి త్రినాథాచారి ఆధ్వర్యంలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను మనోహరంగా ప్రదర్శించారు. అలరింపు, బ్రహ్మకడిగిన పాదము, అదివో అల్లదివో శ్రీహరివాసము, మూషిక వాహన అంశాలను ప్రదర్శించారు. సంగీత విద్వాంసురాలు సుసర్ల నందిని బృందం వాగ్గేయ కారుల కీర్తనలు పలికించారు. చివరిగా సాయి నిహారికా బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. నిర్వాహకులు చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు.

ఆకట్టుకున్న సైబర్ మారథాన్



ఇంద్రకీలాద్రి వద్ద భక్తులకు అవగాహన కల్పిస్తున్న స్కేటర్లు

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రి వద్ద విజయవాడ స్కేటర్లు శనివారం నిర్వహించిన సైబర్ మారథాన్ దుర్గమ్మ భక్తులను ఆకట్టుకుంది. ఎన్టీఆర్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల పర్యవేక్షణలో వినాయకస్వామి టెంపుల్ నుంచి కుమ్మరిపాలెం వరకు సాగిన ఈ మారథాన్‌లో 35 మంది స్కేటర్లు పాల్గొన్నారు. క్యూ లైన్లలోని భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగేలా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్ తదితర ఆన్‌లైన్ మోసాలపై స్కేటర్లు అవగాహన కల్పించిన తీరు అమ్మవారి భక్తులను ఆలోచింపజేసింది. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దని, చేతిలోని స్మార్ట్ ఫోన్‌ను జాగ్రత్తగా వినియోగిస్తే సైబర్ నేరాల బారి నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. తెలిసో.. తెలియకో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే గోల్డెన్ అవర్(గంట లోపే) 1930 లేదా సైబర్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని కోరారు.

సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడమ్ 125 బైక్ ఆవిష్కరణ



బైక్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బజాజ్ రీజినల్ మేనేజర్స్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): బజాజ్ ఆటో వారు ప్రవేశపెట్టిన మొట్ట మొదటి సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడమ్ 125 బైక్‌ను శనివారం లాంఛనంగా నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. బజాజ్ డీలర్ వరుణ్ బజాజ్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సరికొత్త బైక్‌ను బజాజ్ ఆటో రీజినల్ మేనేజర్(సేల్స్) సీఎస్ కరుణాకర్, రీజినల్ మేనేజర్ సర్వీసు సచిన్ జైన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. తమ 25వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ సరికొత్త ఫ్రీడమ్ బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకూ తాము 3.75 లక్షల ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు విక్రయించామని తెలిపారు. సరికొత్త ఫ్రీడమ్ బైక్‌ను ఒక ట్యాంక్ పెట్రోలు కోసం, మరో ట్యాంకు సీఎన్‌జీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశామన్నారు. ఇందులో రెండు రకాల ఫ్యూయల్స్‌ను వాడుకోవచ్చని చెప్పారు. మూడు వేరియంట్లలో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా పారేపల్లి మహేష్



మహేష్‌ను సత్కరిస్తున్న వేణుమాధవ్ తదితరులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా పారేపల్లి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ధనాలకోట వాసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మహేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో స్వర్ణకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు ధనాల కోట శ్రీనివాసరావు, పంచుమర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కణితి శ్రీనివాసరావు, కర్రి రాఘవేంద్ర, అధికార ప్రతినిధి పి.సాయికిరణ్ పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు నిత్యావసరాల పంపిణీ



బ్రాహ్మణులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలను సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. సేవా సంఘం ప్రధాన కార్యదర్శి టీవీడీ రమేష్ మాట్లాడుతూ సేవా సంఘం బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 50 మంది బ్రాహ్మణులకు దాతల సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వి.గురుమూర్తి, కోశాధికారి అనుముల సోమశేఖర్ పాల్గొన్నారు.